క్లుప్తంగా

రేపటి నుంచి వేంకటేశ్వర కల్యాణ మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో కొలువైన పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, ధ్వజారోహణ, సోమవారం రాత్రికి వేద మంత్రాల నడుమ స్వామి వారికి దివ్య కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

14 వరకు సాంఘిక నాటిక పోటీలు

కల్యాణ మహోత్సవాల సందర్భంగా సాంఘిక నాటిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు 10 నుంచి 14వ తేదీ వరకూ జరుగుతాయి. 14న బహుమతులు ప్రదానం చేయనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

10వ విద్యార్థుల కోసం ప్రార్థనలు

సామర్లకోట: మండల పరిధిలో 10వ తరగతి విద్యార్థుల కోసం ఈ నెల 10వ తేది సాయంత్రం 4 గంటలకు స్థానిక సీబీఎం హైస్కూల్ ఆవరణలో మండల పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రార్థనలు చేయనున్నట్టు సంఘ అధ్యక్షుడు డాక్టర్ టి.బ్లెసింగ్ తెలిపారు. అనంతరం ప్రతి విద్యార్థికీ ప్యాడ్, పెన్ను, స్కేలు, రబ్బరు, పెన్సిల్ అందజేయనున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ల సంఘ నాయకులు పిలుపునిచ్చారు. సంఘ కార్యదర్శి కె.జయబాబు, కోశాధికారి వై.కరుణకుమార్ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


పూజలు అందుకున్న కుమారా రామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఫాల్గుణ నవమిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెలవు దినం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దేవస్థాన అన్నదాన ట్రస్టు నుంచి అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు


పిఠాపురంలో వేంకటేశ్వర స్వామి ఆలయం

పిఠాపురం: స్థానిక టీటీడీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 15వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో నిత్యం స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులందరూ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ మీటర్ల దగ్ధం


కాలి దగ్ధమైన ఇంటి పైకప్పు

పెద్దాపురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల శనివారం పట్టణంలోని ఓ ఇంట్లో విద్యుత్ మీటర్లు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన విలయత్ ఆలీ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. నాలుగు విద్యుత్ మీటర్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనతో భారీ శబ్దాలు, ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న పెద్దలు, పిల్లలు ఒక్కసారిగా వీధులోకి పరుగులు తీశారు. స్థానికులు ఇంటిలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చిన మంటలను నీటితో ఆర్పివేయడంతో ఊపిరిపీల్చుకున్నారు.


మహిళా దినోత్సవంలో ఎన్‌జీఓ సత్యను సత్కరిస్తున్న దృశ్యం


టీఎల్ఎం మెటీరియల్ అందజేస్తున్న ఎస్సై, తహసీల్దార్


సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న మెప్మా సిబ్బంది

మహిళా సాధికారతతో దేశాభివృద్ధి

- మహిళా హక్కుల సాధన ప్రతి ఒక్కరి బాధ్యత
- మహిళా దినోత్సవంలో తహసీల్దార్, ఎస్‌ఐ

పెద్దాపురం: ప్రతి మహిళా సంపూర్ణ సాధికారత సాధించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని, మహిళల హక్కుల సాధన ప్రతి ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎస్సై వి.మౌనిక అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు సత్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్, ఎస్సై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు వీరబాబు, సీఐఈ రఘువీర్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఇక్కడి విద్యార్థులకు వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆరుగురు ఉత్తమ తల్లులను వారు ఘనంగా సత్కరించారు. తొలుత విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన టీఎల్ఎం మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఏఓ వేణు, మజ్జి దుర్గా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో

స్థానిక ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, ఎంపీడీఓ శ్రీలలిత, తదితరులను ఘనంగా సత్కరించారు.

వైజ్ ఆధ్వర్యంలో

స్థానిక వైజ్ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షురాలు బి.మల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన వేడుకలకు ఎస్‌ఐ మౌనిక ముఖ్య అతిథిగా పాల్గొని మహిళల హక్కుల పోరాటంలో సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పీఎల్‌హెచ్‌వీ బాధితులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదుల మణి, మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, వైజ్ సంస్థ పీఎం డి.రాజు, దేవి తదితరులు పాల్గొన్నారు.

రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో

ఏపీ రైతుకూలీ సంఘం, ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం పులిమేరులో ఘనంగా నిర్వహించారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ మహిళల హక్కులను అమలు చేయకుండా శ్రమను దోచుకుంటున్న వారిపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు కుంచే అంజిబాబు, రంపా ఏసమ్మ, వల్లూరి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో గుర్తింపు పొందాలి

సామర్లకోట: సమాజంలో గుర్తుండేలా మహిళలు మంచి కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశంలో అనేక మంది మహిళలు ప్రపంచం గర్వపడేలా విధులు నిర్వహించారని వారిని ఆదర్శంగా తీసుకొవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ కుటుంబం సక్రమంగా నడవాలంటే మహిళ కీలకమని అన్నారు. మున్సిపల్ ఆర్వో శ్యామల, జనసేన జిల్లా మహిళా నాయకురాలు పెంకే వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కాళ్ల శ్యామల, పాలిక కుసుమ, నమ్మి దుర్గాభవాని, రెడ్డి లోవకుమారి, జయలక్ష్మి, మెప్మా సిటీ మిషన్ మేనేజరు హుస్సేన్, మున్సిపల్ మేనేజరు కనకరాజు, పిట్టా జానికిరామారావు తదితరులు మహిళ ఔన్నత్యాన్ని వివరించారు. అలాగే మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్, మెప్మాలో ఉత్తమ వ్యాపారాలు చేస్తున్న ఆర్పీలను సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ చెక్కును అందజేశారు.

మహిళా అధికారులను ఆదర్శంగా తీసుకోవాలి

మండలం, జిల్లాలోని వివిధ శాఖల్లో అనేక మంది మహిళా అధికారులు ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ గుర్తింపు పొందుతున్నారని వారిని ఆధర్శంగా తీసుకోవాలని వీకే రాయపురం సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీడీఓ కె. హిమామహేశ్వరిని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో అంగన్‌వాడీల క్రీడా ప్రతిభ

సామర్లకోట: స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు జిల్లా స్థాయిలో క్రీడా పురస్కారాలను అందుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో భాగంగా సామర్లకోట అంగన్‌వాడీ కార్యకర్తలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర సాయి పోటీలకు ఎంపికయ్యారు. దాంతో ఏడుగురు కార్యకర్తలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ చేతుల మీదుగా శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో బహుమతులు అందుకున్నారు.

మహిళలకు సత్కారం

పిఠాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగ శనివారం పిఠాపురంలో వాసవి క్లబ్ కపుల్స్ పలువురు మహిళలను సత్కరించారు. పిఠాపురం కోర్టు ఏపీపీ లీల నాగ రోజాతో పాటు న్యాయ, వైద్యారోగ్య, పోలీసుశాఖలలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ, పిఠాపురం గవర్నమెంట్ హాస్పిటల్ వైద్యులు, స్టాఫ్ నర్సులను ఘనంగా సత్కరించారు.


వీకే రాయపురంలో ఎంపీడీఓకు సత్కారం


ఏపీపీ లీల నాగ రోజాను సత్కరిస్తున్న వాసవి క్లబ్ కపుల్స్ సభ్యులు


ఉత్తమ క్రీడాకారిణి బహుమతి అందుకుంటున్న ఎంపీ శ్రీలక్ష్మి

మన ఆరోగ్యం మన చేతుల్లో..

- పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి
- తాజా కూరగాయాలు, పండ్లు భాగం కావాలి
- వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరి

పెద్దాపురం: మారుతున్న కాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి. మూడు సంవత్సరాల క్రితం కోవిడ్ వంటి విపత్తుల తర్వాత మానవుని జీవనశైలి పూర్తిగా మార్పు చెందింది. మనుషులు రోగాలకు గురికావడం సహజంగా జరుగుతోంది. కారణం అప్పటి వరకూ ఒక విధమైన వాతావరణంలో మార్పు రావడంతో ఏదో ఒక వ్యాధి బారినపడక తప్పడం లేదు. పరిశుభ్రమైన ఆహారాన్ని తినేవారు కాలాలు మారినా వ్యాధుల బారిన పడాల్సిన అవసరం ఉండదని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరసరాల పరిశుభ్రతతో పాటు వ్యాయామం, యోగా, ధ్యానం మంచి ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు.

జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి..

మానవుని జీవనశైలిలో తాజా కూరగాయలు, పండ్లు నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలి. నిల్వ చేసిన ఆహార పదార్థాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. తీపి పదార్థాలు తక్కువ గాను పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ప్రధానంగా పిజ్జాలు, బర్గర్లు, జంక్‌ఫుడ్స్, కూల్‌డ్రింక్స్ వంటికి దూరంగా ఉండాలి. డ్రింక్స్‌కు బదులుగా కొబ్బరి నీరు, మజ్జిగతో చేసే లస్సీ, బటర్ మిల్క్, చెరకు రసం తీసుకోవడం మంచిది.


పెద్దాపురంలో తాజా కూరగాయల దుకాణం

పాలు, పప్పుధాన్యాలు, పండ్లకు ప్రాధాన్యం

కలుషితమైన తాగునీటిని తీసుకోవడం వల్ల మనిషి త్వరగా వ్యాధుల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాలాన్ని బట్టి పరిశుభ్రమైన తాగునీటి తీసుకోవాలి. సాధ్యమైనంత గోరువెచ్చని నీటిని తీసుకోవడం వల్ల వ్యాధుల బారినపడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఆహారంలో నిత్యం పప్పుధాన్యాలు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవడం మంచిది. ఉదయం, సాయంత్రం సమయాల్లో డ్రైఫ్రూట్స్ తీసుకోవడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. కాలానికి అనుగుణంగా పండ్లు తీసుకోవడం మంచిది. దీని వలన శరీరంలో రక్త ప్రసరణ బాగుంటుంది.

> **వ్యక్తిగత శుభ్రత పాటించాలి**
>
> 
>
> మన ఆరోగ్యాన్ని కాపాడుకునే బాధ్యత మన చేతుల్లోనే ఉంది. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తినడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చు. మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదు. ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి.
>
> – డాక్టర్ సూర్యకుమారి ఏరియా ఆసుపత్రి, వైద్యులు, పెద్దాపురం

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి

భోజనానికి, టిఫిన్‌కు ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి, ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినాలి. ఆహారం రుచి తెలియడమే కాకుండా త్వరగా జీర్ణమవుతుంది. ఆహారాన్ని ఒకేసారి ఎక్కువగా తీసుకోకుండా జాగ్రత్త పడాలి. జీర్ణ వ్యవస్థపై పెద్దగా భారం పడకుండా చూడాలి.

వైభవంగా ఏకాదశ రుద్రాభిషేకం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వర స్వామి దివ్య వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ వేద పండితులు ఆకొండి వేంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకర శాస్త్రి శనివారం ఉదయం నాగేశ్వర స్వామి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం లక్ష బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. అపర్ణా దేవికి సహస్ర కుంకుమార్చన చేశారు.

కొనసాగుతున్న ఉభయ రాష్ట్రాల నాటక పోటీలు

కల్యాణోత్సవాలు సందర్భంగా అపర్ణా నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ రాష్ట్రాల నాటక పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సాయి కార్తీక్ కాకినాడకు చెందిన క్రియేషన్స్ బృందం ఎడారిలో వాన చినుకు అనే నాటకాన్ని ప్రదర్శించగా, రెండో రోజు శనివారం హైదరాబాద్‌కు చెందిన కళాంజలి బృందం ప్రదర్శించిన అన్నదాత నాటకం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది.


నాగేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఇంటర్ పరీక్షకు ఆరుగురు గైర్హాజరు

కొత్తపల్లి: వీవీఎస్ విద్యా సంస్థల కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం జంతుశాస్త్ర, గణితం 1బి పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సతీష్‌కన్నా తెలిపారు. పరీక్షలకు మొత్తం 221 మంది హాజరుకావల్సి ఉండగా 215 మంది హాజరై ఆరుగురు గైర్హాజరు అయ్యారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 299 కేసుల పరిష్కారం


కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి

పిఠాపురం: పిఠాపురం కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 299 కేసులు పరిష్కారం అయ్యాయి. సివిల్, క్రిమినల్, మోటారు వెహికల్ ఓపీలు, బ్యాంకు, బీమా, తదితర కేసులను ఈ బెంచ్‌ల ద్వారా పరిష్కరించారు. 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి, సబ్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయ రామేశ్వరి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వివి అపర్ణ బెంచ్‌లు నిర్వహించారు. అంతకు ముందు కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజారావు, కేఎస్ఆర్ భాస్కర్, కార్యవర్గం, సీనియర్ న్యాయవాదులు, ఏజీపీ ఎస్.నాగేశ్వరరావు, ఏపీపీ ఆకుల లీలా నాగ రోజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ.1.89 లక్షల ఆర్థిక సాయం

సామర్లకోట: స్త్రీల ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవాలని డాక్టరు గుమ్మళ సౌమ్య అన్నారు. స్థానిక వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల ఆరోగ్య సమస్యలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. విద్యార్థినులలో సాధారణంగా ఉండే రక్తహీనత, హార్మోన్ల సమస్యలపై అవగాహన పెంచి ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలో వివరించారు. కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఎస్.అభినయ సోదరి ఐశ్వర్య అనారోగ్యానికి గురి కావడంతో విషయం తెలుసుకున్న విద్యార్థులు అధ్యాపకులు స్పందించారు. ఈ మేరకు వారితో పాటు, అధ్యాపకులు రూ.89,391, వైఆర్ఎల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి, శ్రీనివాసులు రూ.లక్ష వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.లావణ్య, కరస్పాండెంట్ వై.లక్ష్మీరాజ్యం, ఐబీటీ స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి, ఏఓ ఆకుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అభినయకు ఆర్థిక సాయం అందజేసిన ప్రిన్సిపాల్

భక్తితోనే వీఐపీ హోదా

కరప: ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక సాధన చేస్తే తప్పక మోక్షం సిద్ధిస్తుందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు అన్నారు. స్థానిక నీలయ్యతోటవీధి రామాలయం వద్ద శనివారం జరిగిన సమరసత సేవా ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భగవంతుడి ఎదుట డబ్బు, అధికారం ప్రదర్శించినంత మాత్రాన వీఐపీలు కాలేరన్నారు. భక్తి భావంతోనే రాముడికి రామదాసు, బాలాజీకి అన్నమయ్య, శివయ్యకు కన్నప్ప పాండురంగడికి తుకారాంలు వీఐపీలు అయ్యారన్నారు. మరణం ప్రతిక్షణం మనవెంటే ఉంటుందని, అది తెలిసి కూడా ధర్మాన్ని విడిచిపెట్టి, పాపాలు చేస్తూ మూటలు పోగేసి దేవుడు దగ్గర వీఐపీ స్థానం పొందాలనుకోవడం అమాయకత్వమే అన్నారు. అధ్యాత్మిక సాధనే మోక్షానికి దారి చూపుతుందని ఆయన వివరించారు. మండల మహిళా కన్వీనర్ పేకేటి లక్ష్మీకాంతం, సహ కన్వీనర్ నున్న అమరావతి, పేకేటి సత్యశ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ధర్మ ప్రచారక్ రఘు

పొలంలోకి దూసుకువెళ్లిన టిప్పర్

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో టిప్పర్ అదుపు తప్పి పొలంలోకి దూసుకుపోయింది. స్థానికుల కథనం ప్రకారం సామర్లకోట–కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం సమీపంలో జాతీయ రహదారి ఫ్లైఓవర్‌కు మట్టి తీసుకువస్తున్న టిప్పర్ అదుపు తప్పి పొలంలోనికి దూసుకుపోయింది. వెంటనే డ్రైవర్ టిప్పర్ నుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నాడు. ఈ సమయంలో రోడ్డుపై వాహనాల రాకపోకలు లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. టిప్పర్ డ్రైవర్లు 24 గంటల పాటు విధులు నిర్వహించి మరుసటి రోజు విశ్రాంతి తీసుకోవడంతో రాత్రి సమయంలో నిద్ర లేక పోవడం వలన తరుచూ టిప్పర్లకు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.


పొలంలోకి ఒరిగిన టిప్పర్

వైభవంగా రామాలయ జీర్ణోద్ధరణ

- చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహాలకు మహాకుంభ సంప్రోక్షణ

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో సుమారు 160 ఏళ్ల నాటి రామాలయం జీర్ణోద్ధరణ, హనుమ, లక్ష్మణ సహిత సీతారామలక్ష్మణ స్వామి వార్ల విగ్రహాలకు మహా సంప్రోక్షణ చేశారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1856లో ప్రతిష్ఠించిన ఈ రామాలయంలో తిరిగి 1994లో చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా జీర్ణోద్ధరణ జరిగింది. తాజాగా పురాణం రామాచార్యులు, వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కోసం మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు శనివారం ఉదయం ప్రాతఃఆరాధన, చతుఃస్థానార్చన, గో పూజ, సుందరకాండ పారాయణం, సంక్షేప రామాయణ హవనం, మూలమంత్ర, మూర్తిమంత్ర హవనాలు, సర్వ గ్రహబాధ, నరదృష్టి నివారణకై శ్రీనారసింహ ఇష్టి, నివేదన, పూర్ణాహుతి, మంగళాసనం నిర్వహించారు. సాయంత్రం సర్పవరం వచ్చిన చిన్న జీయర్‌స్వామిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. తొలుత సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించి, స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రామాలయం వద్దకు వచ్చి జీర్ణోద్ధరణ, విగ్రహాలకు మహా కుంభ సంప్రోక్షణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


రామాలయ జీర్ణోద్ధరణ, మహాకుంభ సంప్రోక్షణలో పాల్గొన్న చిన జీయరు స్వామి

నేడు దేవాంగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం

పెద్దాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్టు ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక భాస్కర కాలనీ ముప్పన రామారావు చేనేత సహకార సంఘ భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. సంఘం అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి వి.శివశంకర్, బొమ్మన దుర్గా ప్రసాద్, బండారు ఆనంద్ ప్రసాద్ హాజరవుతారన్నారు. సమావేశంలో దేవాంగుల ఆర్థిక, సామాజిక స్థితిగతులు, చేనేత రంగం ప్రస్తుత పరిస్థితి, చేనేతల ఉపాధి అభివృద్ధి తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు.

స్వామిత్వ సర్వేలో శిక్షణ

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో స్వామిత్వ సర్వేపై డివిజన్ స్థాయిలో ఒక్క రోజు శిక్షణ తరగతిని శనివారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో సర్వే, మ్యాపింగ్ నిమిత్తం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఓ రవికుమార్, డీఎల్‌పీఓ అమ్మాణి తదితరులు పాల్గొన్నారు.

రేపు కుమారస్వామి కల్యాణోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న వల్లీదేవసేన సమేత కుమారస్వామి వార్షిక కల్యాణోత్సవం సోమవారం రాత్రి 7. 30 గంటలకు జరుగుతుందని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు శనివారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 12న సదస్యం , 15న శ్రీపుష్పయాగం నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.